సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025

గరిష్టం / కనిష్టం
31° / 25°
వాతావరణం
జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.


నేడు గిరిజన దర్బార్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని కోరారు. అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా అధికారులంతా బతుకమ్మ సంబురాల ఏర్పాట్లలో నిమగ్నమైన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేసేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

కిన్నెరసాని ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తివేత



ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటి నిల్వసామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి 8వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం నీటిమట్టం 406.30 అడుగులకు పెరిగింది. ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తి ఉంచి 13వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్ : ఓపెన్‌స్కూల్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 22 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు ఉంటాయని, ఖమ్మం నగరంలోని పదో తరగతి, ఇంటర్‌కు ఒక్కో పరీక్ష కేంద్రం చొప్పున ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులు 287 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల(రిక్కాబజార్) కేంద్రంలో 254 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించామని, ప్రతీ సెంటర్‌కు సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామని, తాగునీరు, మెడికల్, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించామని వివరించారు. ఏమైనా సందేహాలుంటే ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కూరపాటి మంగపతిరావు(80084 03522)ను సంప్రదించాలని సూచించారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీఈఓ దీక్షారైనా తెలిపారు.

వారసత్వ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాల కోసం ముఖాముఖి నిర్వహించారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, డీజీఎం పర్సనల్ తుకారాం ఆధ్వర్యంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు కుటుంబ సభ్యులు, సాక్షుల సమక్షంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. అన్ని వివరాలు నమోదు చేసి వైద్య పరీక్షలకు పంపారు.

అధిక దిగుబడి.. ఆర్థిక పరిపుష్టి

వ్యవసాయ సీజన్ ప్రారంభంలో మార్కెట్‌లో వివిధ రకాల విత్తనాలు విక్రయిస్తారు. విస్తృతంగా ప్రచారం చేస్తూ అధిక దిగుబడులు వస్తాయంటూ దళారులు నమ్మిస్తారు. దీంతో పలువురు రైతులు నమ్మి ఆ విత్తనాలు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు. కొన్ని నాసిరకం, నకిలీ విత్తనాలు కావడంతో పంట ఏపుగా ఎదగక, ఎదిగినా దిగుబడులు రాక నష్టపోతున్నారు. పెట్టుబడి కూడా పూడక అప్పుల పాలవుతున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే రైతులకు మేలైన విత్తనాల సరఫరాకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

–సూపర్‌బజార్(కొత్తగూడెం)



రైతులతో వరిపొలంలో కేవీకే శాస్త్రవేత్తలు

రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీకి శ్రీకారం

- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో వరి, పెసర రకాలు అందజేత
- సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం తోడ్పాటు

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో..

రైతులు మోసపోకుండా ఉండేందుకు, అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతుండగా, జిల్లాలో కూడా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో విత్తనాలు అందజేశారు. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి నష్టాల బారిన పడకుండా రక్షించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామానికి ఒకరిద్దరు చొప్పున ప్రగతిశీల రైతులను ఎంపిక చేసి విత్తనాలు అందించారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల(ఫైల్)

వ్యవసాయ విశ్వవిద్యాలయ వంగడాలు..

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనాలు అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాణ్యమైన, అధిక దిగుబడులు ఇచ్చే, చీడపీడల బారిన పడని వ్యాధి నిరోధక శక్తి కలిగిన విత్తనాలను అభివృద్ధి చేసి అందిస్తున్నారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా దీనిపై దృష్టి సారించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం, విత్తనం కొద్దీ పంట అనే నినాదంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు విత్తనాలు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

డిమాండ్‌కు అనుగుణంగా పంపిణీ



డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేసేందుకు కృషి చేస్తాం. రైతుల ఆర్థిక పరిపుష్టి, ఆహార భద్రత సాధనలో ఇవి కీలకం. సుస్థిరమైన వ్యవసాయ విధానాలు అనుసరించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కేవీకే సహకరిస్తుంది.

–డాక్టర్ టి.భరత్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం

వరి, పెసర రకాలు

జిల్లాలో కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విత్తన కిట్లు వానాకాలం సీజన్‌లో ఎంపిక చేసిన రైతులకు పంపిణీ చేశారు. వరిలో డబ్ల్యూజీఎల్–44, డబ్ల్యూజీఎల్–1537 రకాల విత్తనాలు, పెసర పంటలో ఎంజీజీ–295 విత్తన కిట్లను అందించారు. ఈవిత్తనాలు అధిక దిగు బడి ఇస్తాయని, నేల సారానికి అనుకూలత, రైతుల ఆదాయాన్ని పెంచే లక్షణాలు కలిగి ఉంటాయని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. నాణ్య మైన విత్తనాల కార్యక్రమం సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి దోహద పడుతుందని, రైతుల ఆదా యవృద్ధి, పంటల ఉత్పాదకత పెంపు, ఆహార భద్రతకు దోహదం చేస్తుందని అధికారులు పేర్కొంటున్నా రు. కేవీకే ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 836 విత్తన కిట్లను పంపిణీ చేశారు. వీటిలో వరి డబ్ల్యూజీఎల్–44 విత్తనాలు 220కిట్లు, డబ్ల్యూజీఎల్–1537 విత్తనాలు 127 కిట్లు పంపిణీ చేశారు. వరిలో పిలకలు ఎక్కువగా ఉండటం, చీడపీడలు సోకడం లేదని సాగు చేసిన రైతులు చెబుతున్నారు. దీంతో మిగతా రైతుల నుంచి ఈ రకాలకు డిమాండ్ పెరుగుతోంది. పెసర ఎంజీజీ–295 విత్తనాలు –489 కిట్లను అందించగా, దిగుబడి పెరిగిందని రైతులు పేర్కొంటున్నారు. తక్కువ వ్యవధిలో పంట, అధిక ఉత్పాదకత కారణంగా ఇతర రైతులు ఆసక్తి చూపుతున్నారు.



కొత్తగూడెంలోని గాజులరాజం బస్తీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా..

- జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం
- తొలిరోజు ఘనంగా ఎంగిలిపూల సంబురాలు



బతుకమ్మ పేర్చుతున్న మహిళలు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ సంప్రదాయ వేడుకైన బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆట, పాటలతో పల్లె, పట్టణం సందడిగా మారాయి. వీధులన్నీ బతుకమ్మ పాటలతో మార్మోగాయి. తొమ్మిదిరోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించే వేడుకలు ఆదివారం ఎంగిలపూల బతుకమ్మతో మొదలయ్యాయి. ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చుకుని సాయంత్రం చౌరస్తాలకు చేరుకున్నారు. బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడారు. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో..., చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుడీ ముద్దుల గుమ్మ.., ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మా.. తదితర గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. కొందరు ఇళ్ల ముందు, ఆలయాల్లో సంబురాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. కొత్తగూడెంలో సూపర్‌బజార్, రైటర్‌బస్తీ, పాత కొత్తగూడెం, హనుమాన్ బస్తీ, విద్యానగర్ కాలనీ, హెడ్ ఆఫీస్ ఏరియా, పోస్టాఫీస్ ఏరియా, బస్టాండ్ సెంటర్, మధురబస్తీ, రామవరం, రుద్రంపూర్, లక్ష్మీదేవిపల్లి తదితర ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు సంబురాలు నిర్వహించారు. భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, అశ్వారావుపేట, ఇల్లెందు తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ప్రసాదం పంపిణీ చేశారు.

చిత్రమాలిక 11లో...

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ముదిగొండ: ముదిగొండ మండలంలో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని యడవల్లి, మాదాపురం, ముదిగొండలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, పలు పార్టీల నాయకులు భట్టి సమక్షాన కాంగ్రెస్‌లో చేరనున్నారు. కాగా, వెంకటాపురంలో ఆదివారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడారు. భట్టి పర్యటనను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, మహిళా విభాగం జిల్లా, మండల అధ్యక్షురాలు సౌజన్య, ఝాన్సీరాణి, నాయకులు కందిమళ్ల వీరబాబు, ఇసుకల రమేష్, మట్టా బాబురాంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

అలరించిన సంగీత లహరి

హాజరైన హైకోర్టు న్యాయమూర్తి, ఎమ్మెల్యే

భద్రాచలంటౌన్: పట్టణంలోని గుప్త ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకుని నటరాజ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంగీత లహరి కార్యక్రమం అలరించింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతెల్లం వెంకట్రావు, తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ భీమపాక నగేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. బాలసుబ్రహ్మణ్యం ఎన్నో వేల పాటలు పాడి తెలు వాడి ఖ్యాతిని చాటారని పేర్కొన్నారు. సంగీత లహరి వంటి కార్యక్రమాలతో కళాకారుల ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అతిథులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్, సింగర్ రాజు, పాకల దుర్గాప్రసాద్, బుడగం శ్రీనివాస్, వరలక్ష్మి, సత్యలింగం, రాఘవయ్య, విజయరావు, ఉదయ్‌కుమార్, శ్రీలత, శ్రీహరి, నరేష్, వెంకటేష్, గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి నగేష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు, ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

హరిహర క్షేత్రాన్ని సందర్శించిన న్యాయమూర్తి

పట్టణంలోని హరిహర అయ్యప్ప క్షేత్రాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ నంబూద్రి అరుస్ రామచంద్రన్ స్వాగతం పలకగా న్యాయమూర్తి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆవరణలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

సెలవులకు ఊరెళ్తున్నారా?!

- కొద్ది జాగ్రత్తలతో మీ సొత్తు భద్రం
- సూచనలు జారీ చేసిన పోలీసుశాఖ

ఖమ్మంక్రైం: విద్యాసంస్థలకు దసరా సెలవులు మొదలయ్యాయి. ఇంకోపక్క బతుకమ్మ సందడి ప్రారంభమైంది. దీంతో పిల్లలతో సహా కుటుంబాలు స్వగ్రామాలు లేదా విహారయాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు బయలుదేరనున్నాయి. ఇదే అదునుగా దొంగలు తమ చేతులకు పదును పెట్టే అవకాశముంది. ఈ నేపథ్యాన కష్టపడి సంపాదించిన నగదు, ఆభరణాలు దొంగల పాలుకాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. శాఖాపరంగా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేశామని వెల్లడించిన ఆయన ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

సీపీ జారీ చేసిన సూచనలు

■ పేపర్లు, ఖాళీ సంచులు ఏరుకోవడం, ఇతర సామగ్రి అమ్మకం పేరిట వచ్చే వారి విషయంలో అప్రమత్తంగా ఉంటూ ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తాళం వేసి ఉన్న ఇళ్ల వద్దకు ఒకటి, రెండు సార్లు ఎవరైనా వచ్చి వెళ్లినా అప్రమత్తం కావాలి.

■ ఇళ్లలో వృద్ధులు ఉంటే అపరిచితులకు ఎలాంటి సమాచారం ఇవ్వొద్దని సూచించాలి. తరచుగా పరిశీలించాలని ఇరుగుపొరుగు వారికి తెలపాలి. వీరి తద్వారా తరచూ సమాచారం తెలుసుకోవాలి.

■ ఇతర చోట్లకు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులను ఇంట్లో పెట్టొద్దు. బ్యాంక్ లాకర్లలో పెట్టడం ద్వారా భద్రత ఉంటుంది. ఇంటికి తాళం వేసి చాలారోజులు వెళ్లాల్సి వస్తే సమీప పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. తద్వారా సిబ్బంది గస్తీకి వచ్చినప్పుడు పరిశీలించే అవకాశం ఉంటుంది.



■ కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం. తద్వారా ఎక్కడ ఉన్నా సెల్‌ఫోన్‌లో తమ ఇంటి చుట్టూ జరుగుతున్న అంశాలను తెలుసుకోవచ్చు. అలాగే, అపార్ట్‌మెంట్లకు తప్పనిసరిగా వాచ్‌మెన్లను నియమించుకోవాలి. అంతేకాక సమీప పోలీసుస్టేషన్‌తో పాటు పెట్రోలింగ్ సిబ్బంది ఫోన్‌నంబర్లు తీసుకుంటే అనుమానితులు కనిపించినప్పుడు సమాచారం ఇవ్వడం వీలవుతుంది.

■ బీరువా తాళాలు ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లాలి. ఇంటి తాళం కానరాకుండా చూస్కోవాలి. అలాగే, ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టం అమర్చుకోవడం సురక్షితం.

మమ్మేలు తల్లీ..



విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న శ్రీ కనకదుర్గ ఆలయం

- పెద్దమ్మతల్లి ఆలయానికి ఉత్సవ శోభ
- శ్రీ దేవీ శరన్నవరాత్రులకు ముస్తాబైన గుడి
- నేటి నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వేడుకలు

పాల్వంచరూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే పెద్దమ్మతల్లి (శ్రీకనకదుర్గ)ఆలయం శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలకు ముస్తాబైంది. విద్యుత్ దీపాల అలంకరణతో శోభిల్లుతోంది. ఏటా దసరా పండుగకు ముందు ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వేడుకలు జరపనున్నారు. ఈ సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తారు. మొక్కులు తీర్చుకుంటారు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా వేద పండితులను తీసుకొచ్చి అమ్మవారికి పూజలు జరిపిస్తారు. ఉత్సవాలను పురస్కరించుకుని రోజూ సహస్ర నామార్చన, కుంకుమార్చనలు, చండీహోమం, శ్రీచక్రార్చనలు, ఇతర హోమాలు, అమ్మవారికి దర్బారు సేవ, నవదుర్గ అలంకారాలతో కొలువు నిర్వహించనున్నారు.

కలశస్థాపనతో వేడుకలు ప్రారంభం

22న ఉదయం 9.30 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యావాచనం, అఖండ దీపారాధన, దీక్షాధారణ చేయనున్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరా వు దంపతుల కలశస్థాపనతో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు క్యూలైన్లు, నీరు, నీడ ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఆలయానికి రంగులువేశారు. వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, ప్రచార రథం ద్వారా ప్రచారం చేశారు. ఆలయం చుట్టూ లైటింగ్, పలుచోట్ల హోర్డింగులు ఏర్పాటు చేశారు. వేడుకల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచీ భక్తులు హాజరుకానున్నారు. దీంతో పదిరోజులపాటు ఆలయ ప్రాగంణం భక్తులతో కిటకిటలాడనుంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ రజనీకుమారి, ఆలయ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు తెలిపారు.

అమ్మవారి అలంకారాలు..

వేడుకలను పురస్కరించుకుని అమ్మవారు దశ రూపాల్లో దర్శనమిస్తారని, ఈసారి ఒకరోజు ఎక్కువగా ఉత్సవాలు జరుగుతాయని వేద పండితులు చెబుతున్నారు. మొదటి రోజున 22న శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారిని అలంకరిస్తారు. 23న మంగళ గౌరిదేవీ, 24న అన్నపూర్ణదేవి, 25న శ్రీగాయత్రీదేవి, 26న మహాలక్ష్మి దేవి, 27న శ్రీలలితా పరమేశ్వరీదేవి, 28న శ్రీచండీ దేవి, 29న శ్రీసరస్వతీదేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసుర మర్ధిని, 2న శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.



పెద్దమ్మతల్లి అమ్మవారు

ఒకరోజు ఎక్కువగా..



ఈ ఏడాది అధిక మాసం రావడంతో తిథుల్లో హెచ్చు తగ్గులు వచ్చాయి. దీంతో ఈసారి నవరాత్రి వేడుకలు ఒకరోజు ఎక్కువగా జరుగుతాయి. రెండేళ్లకో సారి ఇలా జరుగుతుంది. గతంలో ఒకసారి 20 రోజుల పాటు వేడుకలు జరిగిన సందర్భం కూడా ఉంది.

– పద్మనాభశర్మ, వేదపండితుడు

వైభవంగా ఉత్సవాలు



ఆలయంలో తొమ్మిది రోజుల పాటు శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు వై భంగా జరుగుతాయి. చివరి రోజు సామూహిక రమాసహిత సత్యనారాయణ వ్రత పూజలు, అన్నదానం నిర్వహిస్తాం.

–ఎస్.రజనీకుమారి, పెద్దమ్మగుడి ఈఓ

భద్రగిరిలో రేపటి నుంచి..

- భద్రాచలం రామాలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు
- తొమ్మిదిరోజులపాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి తొమ్మిదిరోజులపాటు మహా లక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వనున్నారు. తొమ్మిది రోజుల అలంకరణ అనంతరం విజ యదశమి రోజున దసరామండపంలో శమీ, ఆయుధ పూజ, శ్రీ రామలీలా మహోత్సవాలను ఘనంగా జరపనున్నారు. ప్రతీ రోజు శ్రీలక్ష్మి అమ్మవారి సన్నిధిలో అభిషేకం, చిత్రకూట మండపంలో సామూహిక శ్రీ రామాయణ పారాయణం, మధ్యాహ్నం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం చిత్రకూట మండపంలో శ్రీరామాయణ ప్రవచనం, తిరువీధి సేవ, ఇతర ప్రత్యేక పూజలను నిర్వహించనున్నారు.



శ్రీ మహాలక్ష్మి అమ్మవారు(ఫైల్)

మంగళవారం ఆదిలక్ష్మిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారు. 24న సంతానలక్ష్మి, 25న గజలక్ష్మి, 26న ధనలక్ష్మి, 27న ధాన్యలక్ష్మి, 28న విజయలక్ష్మి, 29న ఐశ్వర్య లక్ష్మి, 30న వీరలక్ష్మి, అక్టోబర్ 1న మహాలక్ష్మిగా అమ్మవారిని అలంకరించనున్నారు. 2న విజయదశమి సందర్భంగా విజయోత్సవం, శమీ పూజ, ఆయుధ పూజ, శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించనున్నారు.

ఆదిలక్ష్మి అలంకరణ విశిష్టత

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మహాలక్ష్మి అమ్మవారు తొలిరోజు ఆదిలక్ష్మిగా దర్శనమివ్వనున్నారు. భగవంతుని గుర్తించడానికే ఆలంబమైన లక్ష్మీ తత్వాన్నే ఆదిలక్ష్మి అంటారని, ఆ అమ్మ వారి వల్లనే వేదవేద్యుని గుర్తించగలిగారని పండితులు చెబుతున్నారు. చతుర్భుజాలతో, పై రెండు చేతుల్లో పద్మాలను ధరించి, వరద–అభయ హస్తాలతో విరాజిల్లుతున్న ఆదిలక్ష్మి అమ్మవారు తొలి అలంకరణగా రామాలయంలో దర్శనమివ్వనున్నారు.

క్లుప్తంగా

97 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.41 లక్షలు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి సిఫార్సుతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో నాయకులు పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 97 మందికి రూ.41 లక్షల సాయం మంజూరు కాగా, పీసీసీ ప్రధానకార్యదర్శి మద్దినేని స్వర్ణ కుమారి, నాయకులు తుంబూరు దయాకర్ రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్ లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. వివిధ మండలాల నాయకులు బాలాజీనాయక్, స్వర్ణ నరేందర్, వడ్డె బోయిన నరసింహారావు, ఉమ్మినేని కృష్ణ, ఉప్పునూతల నాగేశ్వరరావు, ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, అర్వపల్లి శివ, బోడా శ్రావణ్, కాంపాటి వెంకన్న, గౌస్, విప్లవ్‌కుమార్, గురుమూర్తి, వేణు, రంజిత్ పాల్గొన్నారు.

బాలిక ప్రసవం

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మంక్రైం: బాలిక ప్రసవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని తండాకు చెందిన సదరు బాలిక గర్భం దాల్చగా, నెలలు నిండడంతో కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం చేర్పించినట్లు సమాచారం. అక్కడ బాలిక ఆడ శిశువుకు జన్మనివ్వగా, పాపను తీసుకెళ్లేందుకు వారు నిరాకరించారని తెలిసింది. దీంతో శిశువును అమ్మేందుకు ఆస్పత్రి నర్సు ద్వారా బేరసారాలు సాగించినట్లు సమాచారం. విషయం బయటకు పొక్కడంతో ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు పోలీసులు విచారణ చేపట్టారు. శిశువును స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే, చివరకు బాలిక బంధువులే తీసుకెళ్తామని చెప్పినట్లు సమాచారం. కాగా, బాలిక గర్భానికి అదే తండాకు చెందిన యువకుడు కారణమని గుర్తించి ఖమ్మం వన్ టౌన్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశాక, మరిపెడ పోలీసుస్టేషన్‌కు బదలాయించారు. అయితే, శిశువు అమ్మకం విషయమై వివరణ కోరేందుకు బాలల సంరక్షణ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదు.

ఎలక్ట్రీషియన్‌కు కరెంట్‌షాక్

సత్తుపల్లిరూరల్: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరఫరా నిలిపివేసేందుకు ప్రయత్నించిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు విద్యుదాఘాతంతో గాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన ధర్మసోత్ రామకృష్ణ ప్రైవేట్ ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నాడు. ఓ రైతు పొలంలో మోటారు ఫ్యూజ్ పోయిందని చెప్పగా, ఆదివారం మరో వ్యక్తితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరఫరా నిలిపేందుకు ప్రయత్నించాడు. రామకృష్ణ మెడలో ఉన్న గొలుసు 33/11 కేవీ వైర్‌కు తాకగాషాక్‌తో ఆయన మెడ భాగం కాలిపోయింది. ఆయన్ను 108 ద్వారా సత్తుపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విద్యుత్, పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.

కుళ్లినా, బూజు పట్టినా.. క్రషింగే

- పామాయిల్ ఫ్యాక్టరీల్లో జరుగుతున్న తంతు
- ఎఫ్ఎఫ్ఏ పెరుగుతుండటంతో పొంచి ఉన్న ముప్పు
- వరుస హార్వెస్టింగ్ హాలీడేలతో పెను ప్రమాదం
- ఆయిల్‌పామ్ గెలల నాణ్యత తగ్గే అవకాశం



బూజు పట్టిన గెలలను కన్వేయర్‌లోకి నెడుతున్న బుల్



అశ్వారావుపేట ఫ్యాక్టరీలో బూజు పట్టిన పామాయిల్ గెలలు

అశ్వారావుపేట: అశ్వారావుపేట, అప్పారావుపేట ఆయిల్‌పాం ఫ్యాక్టరీలకు ఆయిల్‌ఫెడ్ అధికారులు తరచుగా హార్వెస్టింగ్ హాలిడేలు ప్రకటిస్తున్నారు. ఫ్యాక్టరీల సామర్థ్యానికి మించి గెలలు వస్తుండడంతో అదనంగా గెలలను స్వీకరించలేక అధికారులు ఈ నిర్ణయానికి వస్తున్నారు. కానీ, స్వీకరించిన గెలలు కూడా ఫ్యాక్టరీ ఆవరణలోనే కుళ్లిపోతున్నాయి. బూజుపట్టి ముడిచమురు దిగుమతి నాణ్యతపై ప్రభావం చూపేలా ఉన్నాయి. రైతులకు లాభం చేకూర్చకపోగా నష్టాన్ని తెచ్చి పెట్టేలా నూనె దిగుబడి నాణ్యత మారే ప్రమాదముందని సమాచారం. వందలాది టన్నుల గెలలు ఫ్యాక్టరీ ఆవరణలో ఉండటం. క్రషింగ్ జరగడం ఆలస్యం అవడంతో వాతావరణంలో వేడికి సెల్ఫ్ బాయిల్ అయి చెమ్మ పట్టి బూజు పడుతున్నాయి. ఆ తర్వాత కుళ్లడం మొదలవుతోంది. గెలల అడుగు వరుసల్లో ఈప్రక్రియ జరుగుతోంది. పేరుకుపోయిన గెలల్లో నుంచి అడగువాటిని పరిశీలించడం ఎవరికీ సాధ్యం కావడం లేదు. క్రషింగ్ వంతు వచ్చేసరికి గెలలు 80 శాతం మేర కుళ్లిపోతున్నట్లు తెలిసింది. ఇలాంటి గెలలను క్రషింగ్ చేయడం ద్వారా దిగుమతిపై తీవ్ర ప్రభావాలు పడే ప్రమాదమున్నదని అధికారులకు, రైతులకు, శాస్త్రవేత్తలకు తెలిసిన సంగతే. కానీ అలా.. కానిచ్చేస్తున్నారు. కత్తిరించిన గెలలను ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేసుకుంటే చాలన్నట్లు రైతులు.. అన్‌లోడ్ చేసిన గెలలను క్రష్ చేస్తే చాలన్నట్లు అధికారులు చేతులు దులుపుకుంటున్నారు తప్ప తామెరిగిన ముప్పును విస్మరిస్తున్నారు.

ఏమిటీ ఎఫ్ఎఫ్ఏ.. ఎఫెక్ట్..?

ముడి పామోలిన్ ఆయిల్ లేదా క్రూడ్ పామ్‌ఆయిల్ (సీపీఓ)లో ఫ్రీ ఫ్యాటీ యాసిడ్స్ (ఎఫ్ఎఫ్ఏ) ఉంటాయి. ఈ ఎఫ్ఎఫ్ఏ 5 శాతం లోపు ఉంటేనే వంట నూనెగా ఈ సీపీఓను రిఫైన్ చేసి వాడుకోవచ్చు. 5 శాతానికి పెరిగితే సబ్బులు, బయోడీజిల్ వంటి నాన్ ఫుడ్ ఇండస్ట్రీలకు తక్కువ ధరకు విక్రయించాల్సి ఉంటుంది. ఎడిబుల్ ఆయిల్ ఇండస్ట్రీలో క్రూడ్ పాయాయిల్ టన్ను విలువ రూ.1.13లక్షలుగా ఉంది. అదే నాన్ ఫుడ్ ఇండస్ట్రీల్లో ఇంత ధర రాదు. అవసరాన్ని బట్టి.. నాణ్యతను బట్టి.. డిమాండ్‌ను బట్టి.. స్టాకును బట్టి మారుతుంటుంది. కుళ్లిన, చెడిపోయిన గెలలను కలిపి క్రష్ చేయడం ద్వారా ఎఫ్ఎఫ్ఏ ప్రస్తుతం అశ్వారావుపేట ఫ్యాక్టరీలో 4.45శాతంగా ఓషిష్టులో నమోదైంది. గెలల నాణ్యత మరీ తగ్గే కొద్దీ ఎఫ్ఎఫ్ఏ పెరిగి 5 శాతం దాటితే సీపీఓ ధర తగ్గిపోయి, రైతులకు చెల్లింపులు తగ్గే అవకాశం ఉంది. తక్కువ ఎఫ్ఎఫ్ఏ ఉన్న సీపీఓను సాధారణ సీపీఓలో కలిపితే నూనె నాణ్యంగా ఉండదని నిపుణులు చెబుతున్నారు.

ఎందుకింత సమస్య..?

తెలంగాణ ఏర్పాటయ్యాక ఆయిల్‌పాం సాగు విస్తరణ పెరిగింది. నాలుగేళ్ల క్రితం నాటిన మొక్కలు ఈ ఏడాది కాపునకు వచ్చాయి. అశ్వారావుపేట ఫ్యాక్టరీ గతేడాది మొత్తం గానుగాడిన గెలల కంటే గడిచిన 9నెలల్లో గానుగాడిన గెలలు దాదాపు రెట్టింపు. అప్పారావుపేటలోనూ అంతే. ఇంకా మూడు నెలల సీజన్ ఉండటంతో ప్లాంట్ నిండిపోయి.. ట్రాక్టర్లు, లారీలు ఫ్యాక్టరీ గేటు దాటి జాతీయ రహదారిపై బారులు తీరుతున్నాయి. దీంతో అధికారులు హార్వెస్టింగ్ హాలిడేలను ప్రకటిస్తున్నారు. ఏటా నవంబర్ 1 నుంచి మరుసటి ఏడాది అక్టోబర్ నెలాఖరు వరకు ఆయిల్ ఇయర్‌గా పరిగణిస్తారు. ఈ ఏడాది ఆయిల్ ఇయర్‌లో మరో రెండు నెలల 10 రోజులు క్రషింగ్ చేశారంటే గతేడాది గణాంకాలను మించి పోవడం ఖాయం. కానీ, ఫ్యాక్టరీలను డిమాండ్‌కు తగిన విధంగా ఆధునికీకరించని కారణంగా ఈ దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

రెండు ఫ్యాక్టరీల క్రషింగ్ వివరాలిలా..

ఆయిల్ ఇయర్ (నవంబర్ – అక్టోబర్)	2023-24	2024-25
ఫ్యాక్టరీ		
అశ్వారావుపేట	4,700 టన్నులు	8,500 టన్నులు
అప్పారావుపేట	1.80లక్షల టన్నులు	1.78 లక్షల టన్నులు

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



గతేడాది కంటే దిగుబడి పెరగడంతో సమస్య ఉత్పన్నమైంది. అయినా రెండు ఫ్యాక్టరీలలో గెలలు తీసుకుంటున్నాం. గెలలు ఇంకా వస్తే సిద్దిపేట ఫ్యాక్టరీకి డైవర్ట్ చేస్తాం. వేంసూరు మండలం కల్లూరుగూడెం ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ సమస్య ఉత్పన్నం కాకపోవచ్చు. రైతులు సహకరించాలి.

–నాగబాబు, మేనేజర్, అశ్వారావుపేట ఫ్యాక్టరీ

మరక మంచిదే..!

- ఏసీబీకి దొరికినా కఠిన చర్యలు కరువు
- బదిలీ లేదా పాత స్థానంలోనే పోస్టింగ్
- ఫలితంగా రెవెన్యూ శాఖలో యథావిధిగా దందా



తల్లాడలో ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు (ఫైల్)

సత్తుపల్లి: ఏసీబీ అధికారులకు పట్టుబడడం.. ఆపై కొన్నాళ్లకు మరోచోట పోస్టింగ్ వస్తుండడంతో రెవెన్యూ శాఖలోని కొందరు ఉద్యోగులకు 'మరక మంచిదే' అన్న చందంలా మారింది. అవినీతి ఉద్యోగులపై కఠిన చర్యలేమి లేకపవడంతో ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా యథాతథంగా దందా సాగించడం రివాజులా కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. 2019 మార్చిలో గంగారం వీఆర్వోగా పనిచేసిన పద్ద వెంగళరావు రైతు దాసరి మాధవరెడ్డి నుంచి రూ.18వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఆ వెంటనే ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. కానీ వెంగళరావు అయ్యగారిపేట జీపీఓగా సత్తుపల్లి తహసీల్‌లోనే ఇటీవల మళ్లీ చేరడం గమనార్హం. ఇలా రెవెన్యూశాఖలో అవినీతి కేసుల్లో ఏసీబీకి పట్టుబడిన వారిలో ఎక్కువ మంది పాత స్థానాల్లో పోస్టింగ్ తెచ్చుకుంటుండడంతో గతంలో ఫిర్యాదు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

మాకేంటి భయం?

రెవెన్యూశాఖలో కొందరు ఉద్యోగుల పనితీరు ఉన్నతాధికారులకు తలనొప్పి తీసుకొస్తుందనే ఆరోపణలున్నాయి. సత్తుపల్లి నియోజకవర్గంలో ఒకరిద్దరు ఆర్ఐలు ఎలాంటి భయం లేకుండా ఫోన్‌పే ద్వారా డబ్బు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై అధికార పార్టీలోని ఓ ముఖ్యనేత సదరు ఆర్ఐలను పిలిచి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అయినా వారిలో మార్పు రాకపోగా మరింత విచ్చలవిడిగా డబ్బులు లాగుతున్నట్లు తెలుస్తోంది.

అంతా ఆపరేటర్ల చేతుల్లోనే..

భూమి రిజిస్ట్రేషన్లుకు వచ్చే రైతుల నుంచి నేరుగా అధికారులు డబ్బు తీసుకోవడం లేదని సమాచారం. కంప్యూటర్ ఆపరేటర్లను మధ్యవర్తులుగా నియమించుకుని వారితోనే బేరసారాలు సాగించడంతో పాటు డబ్బు వసూళ్లు కూడా వారి చేతుల మీదుగానే నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఏసీబీ దాడి జరిగినా నేరుగా పట్టుబడే అవకాశం లేకపోవడంతో అధికారులు ఈ మార్గం ఎంచుకున్నట్లు సమాచారం. దీన్ని అదునుగా తీసుకుని కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోని ఆపరేటర్లు అధికారులు చేయలేని పనులను సైతం అవలీలగా చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నట్లు తెలిసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలైన వీరి ఆగడాలపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం కారణాలు అంతుపట్టక జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీలతోనే సరి

అధికారులు, ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వచ్చినా, ఏసీబీకి పట్టుబడినా బదిలీతోనే సరిపెడుతుండడంతో వారిలో భయం ఉండడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇంకొందరికైతే అదే మండలంలో పోస్టింగ్ దక్కుతుండడంతో మళ్లీ దందా మొదలుపెట్టేస్తున్నారని సమాచారం. ఇటీవల జరిగిన ఆర్ఐల బదిలీ వ్యవహారం ఇందుకు నిదర్శనంగా నిలవగా... కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేసినా వారి వ్యవహార శైలిలో మార్పు రావటం లేదనే విమర్శలున్నాయి.

బీటీపీఎస్‌లో అధికారుల చేతివాటం!



బీటీపీఎస్ ప్లాంట్

మణుగూరు రూరల్: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో అధికారుల తీరు ఇష్టారాజ్యంగా మారింది. మామూళ్లు ఇచ్చినవారికే టెండర్లు అప్పగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2015లో అప్పటి ఐటీడీఏ పీఓ బీటీపీఎస్ ప్రభావిత గ్రామాలైన సాంబాయిగూడెం, దమ్మక్కపేట, సీతారాంపురం, పోతిరెడ్డిపల్లి–1,2,3 గ్రామాల్లో వీటీడీఏలు ఏర్పాటు చేశారు. ప్లాంట్‌లో ప్రారంభమయ్యే అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ పనులు 100 శాతం స్థానికులకు, స్థానిక వీటీడీఏ సొసైటీలకు అప్పగించాలనే నిబంధనతో ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ప్లాంట్‌లో 150మంది వరకు సుమారు 60 కిలోమీటర్ల దూర ప్రాంతాలవారే ఉన్నారు. 2018లో స్థానిక సొసైటీ సభ్యులకే ఆర్టిజన్లుగా అవకాశం కల్పించాలని, సుమారు 300 మందికి తగ్గకుండా తీసుకోవాలని ఉత్తర్వులున్నా అమలు చేయలేదని, ఇందుకు విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు అవకాశాలు కల్పించారని తెలుస్తోంది. నామినేటెడ్ పనుల్లో కూడా స్థానికులకు అవకాశం కల్పించడం లేదని ఆదివాసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఫ్లైయాష్, యాష్‌పాండ్ టెండర్లలో ఓ అధికారి చక్రం తిప్పి ఇతర ప్రాంతానికి చెందిన ఓ కంపెనీకి రూ.10లక్షలకు కట్టబెట్టారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అదే అధికారి స్క్రాప్ టెండర్ వ్యవహారంలో రూ.20లక్షలు తీసుకున్నారని, తాను గతంలో పనిచేసిన కంపెనీలోని ఓ వ్యక్తి కుటుంబానికి టెండర్ అప్పగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సంస్థ అవసరాలకు వినియోగించే కమర్షియల్ వెహికల్స్ స్థానంలో సొంత వాహనాలు తిప్పుతూ రూ.లక్షల్లో బిల్లులు డ్రా చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయాలపై బీటీపీఎస్ సీఈ బిచ్చన్నను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులో లేరు.

ఖమ్మం.. కథలకు కాణాచి



సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ తెలుగు ప్రత్యేకం కాగా.. అందులో ఖమ్మం కథలకు కాణాచిగా నిలుస్తోందని తెలంగాణ సాహిత్య చరిత్ర పరిశోధకులు, విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. 'ఖమ్మం స్ఫూర్తి– కథా తెలంగాణ సంస్థ' ఆధ్వర్యాన ఖమ్మంలో ఆదివారం జరిగిన 'కందిలి తెలంగాణ కథల సంకలనం' ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు.

ఈ సంకలనంలో ఆదివాసీల జీవితం, సామాజిక స్థితిగతులు తదితర అంశాలపై 11 మంది రాసిన కథలు విభిన్నమైన కథాంశాలతో ఉన్నాయని తెలిపారు. అంతేకాక కవి, కథకులు వంశీకృష్ణ రాసిన విశ్లేషణ దారీ, దీపంగా నిలుస్తుందని చెప్పా రు. సాహిత్య, సామాజిక విశ్లేషకులు వేణుగోపాల్, పెద్దింటి అశోక్‌కుమార్ మాట్లాడగా కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులు ప్రసేన్, ధరణికోట రమేష్ కుమార్, సీతారాం, రవిమారుత్, షఫీ, ఇబ్రహీం, నిర్గుణ్, జయశ్రీ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి తలకొరివి పెడుతున్న సంజన

ఇల్లెందురూరల్: మండలంలోని హనుమంతులపాడు గ్రామంలో జక్కుల సతీశ్ (40) ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున తన గదిలో దూలానికి ఉరివేసుకున్న సతీశ్‌ను ఉదయం చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అతడికి ఇద్దరు కుమార్తెలు ఉండటంతో పెద్దకుమార్తె సంజన తలకొరివి పెట్టింది. మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య పెద్ద అల్లుడైన సతీశ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సతీశ్‌కు భార్య ఝాన్సీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దమ్మపేట: కొబ్బరి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏపీలోని ఏలూరు జిల్లా చాట్రాయి మండలం పర్వతాపురం గ్రామానికి చెందిన చొప్పారపు రాజేశ్ (29) భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం మొద్దులగూడెం శివారులోని కొబ్బరితోటలో కాయలు కోయడానికి ఈ నెల 14న వచ్చాడు. ఆయన చెట్టు పైకి ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. సత్తుపల్లిలో చికిత్స అనంతరం విజయవాడ తరతలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై రాజేశ్ తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు దమ్మపేట ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

వాటా.. ఎంతంటా..?

- లాభాల్లో వాటా ప్రకటించడంపై యాజమాన్యం దోబూచులాట
- 35 శాతం చెల్లించాలని కార్మికులు, సంఘాల నేతల డిమాండ్



గనిలో పనిచేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): ఈ ఏడాది సింగరేణి యాజమాన్యం లాభాల్లో వాటాను ప్రకటించలేదు. కనీసం లాభాలను కూడా ప్రకటించలేదు. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన లాభాలను ప్రకటించి, గతేడాది కార్మికులకు చెల్లించిన వాటా 33 శాతానికి మరో 2 శాతం పెంచి 35 శాతాన్ని ఇవ్వాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. ఏటా దసరా పండుగకు 10 రోజుల ముందు లాభాలు ప్రకటించి, ఏరోజు చెల్లిస్తారో తేదీని ప్రకటించేది. కానీ, ఈ సారి లాభాల ప్రకటన లేదు. శాతం ఊసే లేదు. అయితే, సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వమే ప్రకటన చేయాలని యాజమాన్యం భావిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఏమో లాభాల వాటాపై దృష్టి సారించకపోవడంతో కార్మిక వర్గం ఆందోళన చెందుతోంది.

1998 నుంచి లాభాల్లో వాటా

సింగరేణి సంస్థ ఆర్థిక సంవత్సరంలో సాధించిన బొగ్గు ఉత్పత్తి, వాటి అమ్మకాలు టర్నోవర్‌పై ఏటా కంపెనీ ఆర్జించిన లాభాల్లో కొంతశాతం వాటాను 1998 నుంచి కార్మికులకు చెల్లిస్తోంది. గతేడాది కంపెనీ సాధించిన లాభాల్లో 33 శాతం వాటాను కార్మికులకు చెల్లించింది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు మాసాలు అయినప్పటికీ ఇంకా టర్నోవర్‌ను కానీ, లాభాలను కానీ ప్రకటించలేదు. యాజమాన్యం లాభాల వాటాను ఎప్పుడు ప్రకటిస్తుందోనని కార్మికులు ఎదురు చూస్తున్నారు.

ఈసారి ఎంతో..?

గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ గతంలో బీఆర్ఎస్ కంటే (2022–23)లో 32 శాతం చెల్లిస్తే, తాము అధికంగా ఇప్పిస్తామని చెప్పి 2023–24లో 33 శాతం మాత్రమే చెల్లించేలా చేసింది. అయితే ఈసారి పాత 33 శాతమే చెల్లిస్తుందా? లేక ఎంతోకొంత పెంచి ఇస్తుందా? అని ఎదురుచూస్తున్నారు.

2010 నుంచి 2024 వరకు చెల్లించిన లాభాల వాటా వివరాలు

సంవత్సరం	సాధించిన ఉత్పత్తి (మిలియన్ టన్నులు)	కంపెనీకి వచ్చిన లాభాలు రూ.కోట్లలో	చెల్లించిన శాతం	చెల్లించిన నగదు
2010-11	51.33	351.37	16%	56.21
2011-12	52.21	358.27	17%	60.90
2012-13	53.19	401.00	18%	72.18
2013-14	50.40	418.74	20%	83.74
2014-15	52.54	490.44	21%	102.99
2015-16	60.38	1,066.13	23%	245.20
2016-17	61.34	395.38	25%	98.00
2017-18	62.01	1,212.75	27 %	327.44
2018-19	64.50	1,766.00	28 %	494.00
2019-20	64.02	993.86	28%	278.28
2020-21	50.58	272.64	29%	79.06
2021-22	65.00	1,227.00	30%	368.00
2022-23	67.14	2,222.46	32%	711.18
2023-24	70.02	2,412.00	33%	796.00
2024-25	69.01			

శ్వేతపత్రం విడుదల చేయాలి



తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం హయంలో వాటా ఎంత ఇచ్చినా జూన్‌లో చెల్లించాలనే ప్రతిపాదన పెట్టేవాళ్లం. ప్రస్తుత సంఘాలు ఈ విషయంపై పట్టించుకోవడం లేదు. కార్మికుల సమస్యలు పక్కన పెట్టి, కేవలం వారి సొంత ఆరోపణలపై ఆందోళన చేసుకోవటం సిగ్గుచేటు. గుర్తుకు వచ్చినప్పుడు లాభాల విషయం మాట్లాడితే, కంపెనీకి వీలైనప్పుడు చెల్లిస్తుంది. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు సత్తా లేదు.

–మిరియాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

రాజకీయం చేస్తున్నారు



ఇది కార్మికుల సొత్తు. దసరా పండుగకు చెల్లించాల్సిన ఆనవాయి తీఉంది.గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాల చేతకానితనంతో రాష్ట్ర ప్రభుత్వం లాభాలవాటా విషయంలో రాజకీయం చేస్తోంది. కంపెనీకి లాభాలు రూ.5 వేలకోట్లు వచ్చినట్లు ప్రచారంఉంది. ఈ విష యం ప్రకటించాలి. కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలి.

–రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

రైతుపై బీట్ ఆఫీసర్ దాడి



విలేకరులతో మాట్లాడుతున్న బుచ్చయ్య

గుండాల: కోతుల నుంచి కాపాడుకునేందుకు చేనుకు సమీపంలో ఉన్న చెట్లు నరికిన ఓ రైతుపై అటవీశాఖ బీట్ ఆఫీసర్ భాస్కర్ దాడి చేసి గాయపర్చిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి మండలం చంద్రాపురం గ్రామానికి చెందిన దంపతులు గొగ్గల బుచ్చయ్య – లక్ష్మి మొక్కజొన్న చేను వద్ద కాపలాకు వెళ్లారు. చేను వద్దకు వచ్చిన కాచనపల్లి రేంజ్ వలసల బీట్ ఆఫీసర్ భాస్కర్ చెట్లు ఎందుకు నరికారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భుచ్చయ్యపై చేయి చేసుకుని గాయపర్చాడు. చేను చుట్టూ కోతుల నుంచి పంటను రక్షించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న వల, విద్యుత్ ఫెన్సింగ్‌ను తొలగించాడు. విద్యుత్ మీటర్‌ను తీసుకెళ్తుండగా బుచ్చయ్య బతిమిలాడగా.. చేయి చేసుకున్నాడు. అసభ్యంగా దూషించినట్లు బుచ్చయ్య, లక్ష్మి ఆరోపించారు. మొక్కజొన్న చేనును కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నామని, కోతులు చెట్ల మీద ఉండటం వల్ల వాటిని చేనుకు దూరం చేయాలనే ఉద్దేశంతో చెట్లు నరికితే దాడి చేశాడని, మరోమారు చెట్లు నరకమని బతిమిలాడినా వినకుండా చేయి చేసుకున్నాడని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయమై సెక్షన్ ఆఫీసర్ బేబీని వివరణ కోరగా దాడి చేయటం అవాస్తవమన్నారు. చెట్లు నరికినందుకు హెచ్చరించాడని తెలిపారు. ఇదిలాఉండగా రైతుపై దాడి చేసిన ఫారెస్టు బీట్ ఆఫీసర్ భాస్కర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ నేతలు గొగ్గెల శ్రీను, పాయం సత్యనారాయణ కోరారు.

గంజాయితో దొరికిన ముగ్గురు అరెస్ట్

కొత్తగూడెంటౌన్: గంజాయి సేవిస్తూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడిన ఘటన ఆదివారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని శివారు ప్రాంతంలో గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి, మేదరబస్తీకి చెందిన అజ్మీర లోకేశ్, లక్ష్మీదేవిపల్లి ప్రగతినగర్‌కు చెందిన సయ్యద్ ఖలీద్, శ్రీనగర్‌కాలనీకి చెందిన కుక్కల భాస్కర్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను సైతం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ మధుప్రసాద్ కథనం మేరకు.. ములకలపల్లి శివారులోని నూతన శివాలయం సమీపంలోని వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, ఠాణాకు తరలించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండాలో తనపై రమేశ్ అకారణంగా దాడి చేశాడని ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ప్రసాద్ ఆదివారం కొమరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 10వ తేదీన పోచారం తండాలో బంధువుల ఇంటికి వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకుందని, తీవ్రంగా గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.